## జవాన్లపై దాడి పిరికిపంద చర్య

పుల్వామా దాడిలో అమరులైన జవాన్లకు అమెరికాలోని టెక్సాస్‌లో మహాత్మా గాంధీ మెమోరియల్ ప్లాజా వద్ద ఘన నివాళి అర్పించారు. మహాత్మా గాంధీ మెమోరియల్ అఫ్ నార్త్ టెక్సాస్(ఎంజీఎంఎన్‌టీ) ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన “అమరవీరుల శ్రద్ధాంజలి” కార్యక్రమంలో వందలాది మంది ప్రవాసభారతీయులు పాల్గొన్నారు.ఇటీవల కశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన 40 మంది వీర జవాన్లకు ఈ సందర్భంగా పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ మెమోరియల్ ఛైర్మన్ డా. ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ.. ఫిబ్రవరి 14 భారత దేశ చరిత్రలో ఒక చీకటి రోజన్నారు. భారత దేశ రక్షణ కోసం తమ జీవితాలని అంకితం చేసిన వీర జవాన్లపై దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. దాడిలో మరణించిన కుటుంబాలకు తమ ప్రగాడ సంతాపాన్ని తెలియజేశారు. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచ దేశాలన్నీ కలిసికట్టుగా పని చేసి ఉగ్రవాదాన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం పుల్వామా దాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించి, కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎంఎన్‌టీ బోర్డు సభ్యులు రావు కల్వల, బి.ఎన్ రావు, జాన్ హమొండ్, అక్రం సయ్యద్, కమల్ కౌషల్, కమ్యూనిటీ నాయకులు జాక్ గద్వాని, షబ్నం మొద్గిల్, స్వాతి షా, ముజ్బర్ రెహమాన్, తన్వీర్ అర్ఫీ, బెనజీర్, హరి పాత్రో, అరుణ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

